క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం



దాచేపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి అన్నారు. నగర పంచాయతీలోని 3వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రెంటచింతల: ట్రాఫిక్ నిబంధనలను వాహనచోదకులు తప్పనిసరిగా పాటించాలని, పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం రెంటచింతలలోని ప్రధాన రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలను పాటించని 10 మంది వాహనచోదకులపై కేసులు నమోదుచేసి రూ.1,350 అపరాధ రుసుం వసూలు చేయడం జరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఆ వాహనాలకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో డయేరియా కేసులు నమోదు కావటంతో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు కొనసాగుతోంది. సోమవారం 43 మందిని పరీక్షించటం జరిగిందని వారిలో ఎవరికి డయేరియా లక్షణాలు లేవని వైద్యాధికారిణి రాజరాజేశ్వరి తెలిపారు. అదేవిధంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారన్నారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలోని వాటర్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించటం జరిగిందన్నారు. నీళ్లను క్లోరినేషన్ చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

మాచవరం ఎస్ఐ సతీష్ బాధ్యతల స్వీకారం

మాచవరం: మాచవరం ఎస్ఐగా సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించిన ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు పోలీస్ వారికి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



రెంటచింతల: మండల పరిధిలోని పాలువాయి గేటు- పాలువాయి జంక్షన్ మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన దేరంగుల రమేష్(31) పాలువాయి జంక్షన్ నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో మాచర్ల నుంచి గుంటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారు, ఒక కుమార్తె ఉన్నారు. పంచనామ నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య దేరంగుల వెంకట లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.

పంట నమోదు చేయించుకోవాలి

మాచవరం: రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ రామమ్మ తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, కౌలు రైతులు కౌలు రైతు కార్డులను పొంది పంట నమోదు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. గ్రామ సహాయకులు ఎం.నరసయ్య, రెవెన్యూ అధికారి కె. శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుల్లిబాబు, జి. కనకయ్య, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ దుర్గి మండల మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి

దుర్గి: భారతీయ జనతా పార్టీ మండల మహిళా అధ్యక్షురాలిగా కొప్పెర లక్ష్మిని నియమించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె నియామకంపై మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జక్కా సీతారామయ్య, ఉపాధ్యక్షుడు జవిశెట్టి బ్రహ్మయ్య, నాయకులు గుమ్మడి నాసరయ్య, తుపాకుల కోటేశ్వరరావు, మరియదాసు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

- ఎంపీపీ కందుల జాన్
- దాచేపల్లిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ కందుల జాను

దాచేపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకప్రాత పోషించాలని ఎంపీపీ కందుల జాన్ అన్నారు. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ జాన్ మాట్లాడుతూ.. గ్రామ ప్రథమ పౌరుడి బాధ్యతలను సర్పంచ్‌లు సమర్ధవంతంగా నిర్వహించాలని, గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించి మంచి పేరు సంపాదించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటుగా ఆర్థిక సంఘం, పంచాయతీ నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కూడా విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎంపీపీ జాన్ చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ నాగేంద్ల రత్నం, సూపరింటెండెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

గురజాల: గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఇరువురు ఏకతాటిపై ముందుకు వెళ్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఏపీఎస్ఐఆర్డీ పరిశీలకులు మోహన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం దిశగా పనిచేయాలన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులున్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: సర్పంచ్‌లు, కార్యదర్శులు వారి విధులు, బాధ్యతలపై అవగాహన కలిగిఉండాలని ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు కార్యదర్శులకు ఏపీ పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 45, అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్ సెక్షన్ వివరాలపై ఆయన అవగాహన కల్పించారు. రెండో రోజు గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయిలో పర్యటించడం, మూడవ రోజు జీపీడీపీ 2024-25 బెస్ట్ పంచాయతీ నుంచి 4 జీపీడీపీ గ్రామ పంచాయతీలో గుర్తించిన అంశాలపై విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ అబ్జర్వర్ డా. కె.మోహన్ రావు, సర్పంచ్ మున్నా చంద్రం, కార్యదర్శులు నారాయణ, శౌరికుమారి, శిక్షణ టీఓటీలు పాల్గొన్నారు.

మాచర్లలో...

మాచర్ల రూరల్: మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపన, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే సాధ్యపడుతుందని, అభివృద్ధిలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ కె.సరోజినీదేవి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి, పారిశుద్ధ్య పెంపుదలలో గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి అంటు రోగాల నివారణలో కీలకపాత్ర పోషించాలని, తడి పొడి చెత్తలను వేరు చేసి వాటి ద్వారా కృత్రిమ ఎరువులను తయారు చేసి రైతులకు సంపద సృష్టించటం పై పూర్తి అవగాహన పెంచాలని ఆమె కోరారు. ఏపీఎస్ఐఆర్‌డీ పరిశీలకులు మోహన్‌రావు గ్రామాభివృద్ధి, పరిపాలనా నిర్వాహణ, ఘన వ్యర్థాలపై పలు సూచనలు చేశారు. ఈఓపీఆర్‌డీ కోటేశ్వరరావు, సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నోముల కృష్ణ, వెంకట్రామయ్య, బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు మోహన్‌రావు

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాలలో తాగునీటికి, వీధి దీపాలకు, పారిశుద్ధ్యానికి మురుగు కాల్వలకు 10 శాతం చొప్పున వినియోగించాలన్నారు. మిగిలిన 60 శాతాన్ని గ్రామంలో ఉన్న అవసరాలను బట్టి ప్రాధాన్యతల వారీగా పనులు చేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకం కింద చేపట్టాల్సిన పనులను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి కోసం త్వరలో ప్రణాళికలు తయారు చేసి వాటిని అమలు పర్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. తడి-పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి వాటిని వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు సబ్సిడీ పై అందించాలన్నారు. ఎంపీడీఓ డి.ప్రసాద్, సర్పంచ్‌లు శీలం సైదారెడ్డి, దేరంగుల యేగయ్య, పిన్నెబోయిన మార్కొండయ్య, బూడిద వెంకటేశ్వర్లు, గోవిందు, దాసరి వెంకట రమణారావు, రవీంద్ర నాయ పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన అవసరం



జెట్టిపాలెం గ్రామ సదస్సులో మాట్లాడుతున్న గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు

సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు



విద్యార్థినికి వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న జడ్జి వై. శ్రీనివాసరావు

రెంటచింతల: మహిళలు, బాలికల రక్షణకోసం ప్రభుత్వాలు రూపొందించిన వివిధ రకాల చట్టాలపై బాలికలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు రాష్ట్ర, జాతీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలను మానసిక, శారీరక వేధింపులు, లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు భారత ప్రభుత్వం 2019 సెప్టెంబర్ 20న పోక్సో చట్టం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా అనేక రకాల లైంగిక నేరాలపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయవచ్చన్నారు. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించి తమతో ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విద్యాలయం వసతి గృహంలో బాలికలకు ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకుని వంటగదిని, స్టోర్ రూం, బాత్రూమ్స్ పరిశీలించి బాత్రూమ్స్‌లో సరైన నీటి సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థినిలకు పోషకాహార లోపం లేకుండా మంచి పౌష్టికాహారం ఏర్పాటు చేయాలన్నారు. తొలుత జెట్టిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.వి.సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరెడ్డి, న్యాయవాది ఎస్కే జానీబాషా, ఎస్ఐ ఎం.ఆంజనేయులు, మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ-2 వై.శివ నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ డి.రాజకుమారి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదరించాలి..

రెంటచింతల: ప్రత్యేక అవసరాల గల పిల్లలపై ప్రతి ఒక్కరూ ఆదరణ చూపాలని గురజాల సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అనేక రంగాలలో ప్రత్యేక అవరాల గల వారు ఎవరికీ తీసిపోరని ఇప్పటికే నిరూపించారన్నారు. వారికి అందుతున్న సౌకర్యాలను, వారి విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు సహాయ సహకారాలను అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థిని కె.మధుశ్రీకి వినికిడి యంత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో గురజాల బార్ ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం నాగేశ్వరరావు, ఐఈఆర్టీ ఎస్.శివారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సూచనలు పరిగణనలోని తీసుకోవాలి



మండల విద్యా వనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో పని సర్దుబాటు ప్రక్రియకు ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మండలాధ్యక్షుడు వివి రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటుపై తీసుకునే నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. ఆగస్టు 9వ తేదిన విద్యాశాఖ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో సమస్యలు గుర్తించి ప్రస్తావించినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఉపాధ్యాయ సీనియారిటీ అనే చిన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని జీఓ 117, 128 ఆధారంగా పని సర్దుబాటు చేయడం దారుణమన్నారు. 2020లో విడుదల చేసిన జీఓ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, పని సర్దుబాటులో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని సీనియారిటీని లెక్కించినప్పుడు ప్యానల్ నెంబర్ ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని పని సర్దుబాటు చేసేటప్పుడు ఉపాధ్యాయుని సొంత మేనేజ్‌మెంట్‌లో గల ఖాళీలలో భర్తీ చేసిన తరువాత ఇతర మేనేజ్‌మెంట్‌లలో నియమించాలన్నారు. నాసరరెడ్డి, చిన గురవయ్య, సాని శ్రీనివాసరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, బొంతా ఆనంద్, వెంకటేశ్వరరెడ్డి, పద్మ, శిరీష, బాషా తదితరులున్నారు.

నేడు స్వామి వివేకానంద ఫొటో ఎగ్జిబిషన్

మాచర్ల: స్వామి వివేకానంద జీవిత సందేశంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మెట్టు గోవిందురెడ్డి సోమవారం తెలిపారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని మాచర్ల ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ ఎగ్జిబిషన్ ప్రారంభమవుతోందన్నారు. ముఖ్య అతిథులుగా మాచర్ల పట్టణ సీఐ పి.ప్రభాకర్, ఎస్‌కేబీఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారిలు ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

– అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్

దుర్గి: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలు, రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన దుర్గిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మండల న్యాయ అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను క్షుణ్ణంగా వివరించారు. ఎఫ్ఐఆర్, సైబర్ క్రైం వంటి అంశాలపై విద్యార్థినులకు ఆయన వివరించారు. అనంతరం బాలికల విద్యాలయంలో కిచెన్, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆశా జ్యోతి, బార్ కౌన్సిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జూపల్లి శ్రీనివాసరావు, న్యాయవాదులు ప్రసాద్, కానిస్టేబుల్ వెంకయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

జెట్టిపాలెం(రెంటచింతల): నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించి మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారినుంచి దూరంగా ఉండవచ్చని గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందచేసి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశంఉందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల ముందు మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో ఉంచి విక్రయించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. జ్వరం వరుసగా రెండు రోజుల పాటు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యం పొందాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ ఎ.ఆంజనేయులు, ఏఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, ఆరోగ్య సిబ్బంది నరేష్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి గ్రామ సభలు

గురజాల: గ్రామాల్లో ఈనెల 16వ తేదీ నుంచి 29 వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఈ గ్రామ సభలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 16వ తేదీన గొట్టిముక్కల, సమాధానంపేట, 17 దైద, 20 తేలుకుట్ల, 21 పులిపాడు, 22 గంగవరం, కొత్త అంబాపురం, 23 పల్లెగుంత, పాత అంబాపురం, 24 గోగులపాడు, బూదవాడ, 27 గురజాల, జంగమహేశ్వరపురం, 28 చర్లగుడిపాడు, 29వ తేదీన మాడుగుల, అంజనాపురం, జనర్దానపురం గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభల్లో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను, మ్యూటేషన్, సీసీఆర్‌సీ కార్డులు, భూ తగాదాలు, భూ ఆక్రమణలు, 22ఏ జాబితాలో జరిగిన అవకతవకలు గురించి చర్చించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులంతా పాల్గొనే ఈ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కారెంపూడి మండలంలో...

కారెంపూడి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి 30 వరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామాల వారీగా రెవిన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు కారెంపూడి తహసీల్దార్ బీవీఆర్‌సీహెచ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ చినగార్లపాడు, 20న చినకొదమగుండ్ల, 22న గాదెవారిపల్లె, 24న పెదకొదమగుండ్ల, 27న మిరియాల, 29న నరమాలపాడు, 31వ తేదీ ఒప్పిచర్ల గ్రామాలలో రెవిన్యూ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. మళ్లీ సెప్టెంబర్ 3వ తేదీ చింతపల్లి, 5న పేటసన్నెగండ్ల, 10న కారెంపూడి గ్రామాలలో రెవిన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమ్మా.. లేమ్మా..!



కరెంట్ షాక్ తగిలి సొమ్మసిల్లి పడిపోయిన తన తల్లిని లేపుతున్న పిల్లకోతి

బిడ్డపై తల్లికి.. తల్లిపై బిడ్డకు ఉండే ప్రేమ, అనురాగాలు అనిర్వచనీయమైనవి.. మనుషుల్లోనే కాకుండా ఏ జాతిలోనైనా అది సహజం. విషయమేమిటంటే.. పిడుగురాళ్లలో తన పిల్లను ఎత్తుకుని ఓ తల్లికోతి చెట్లపై నుంచి వెళుతుండగా విద్యుత్ తీగ తగిలి కిందపడి స్పృహ తప్పింది. తల్లికోతికి, పిల్లకోతికీ గాయాలయ్యాయి. గాయపడి రక్తమోడుతున్న పిల్లకోతి స్పృహ తప్పిపడిపోయిన తన తల్లిని లేపేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. అమ్మా.. లేమ్మా.. వెళ్లిపోదాం అన్నట్లుగా ఆ పిల్లకోతి చేసే యత్నాలు స్థానికులచే కంటతడి పెట్టించింది. ఇదంతా సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని గంగమ్మతల్లి ఆలయం పక్క బజారులో కనిపించింది. కాసేపటికి పిల్లకోతి ప్రయత్నాలు ఫలించి, తల్లి కోతి లేచి తన పిల్లను కరుచుకుని గెంతుతూ చెట్లపైకి ఎగిరి వెళ్లిపోయింది. దీంతో చూపరులందరూ హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

– పిడుగురాళ్ల

ఘనంగా ఎస్‌టీఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్‌టీఎఫ్‌ఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎస్‌టీఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్‌టీఎఫ్‌ఐ 25వ ఆవిర్భవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్‌ఐ పతకాన్ని సీనియర్ కార్యకర్త విశ్వరూప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారధి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించటంలో ఎస్‌టీఎఫ్‌ఐ అగ్రగామిగా ఉందని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఖాశిం పీరా, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జమాల్, మండల శాఖ అధ్యక్షుడు సాంబశివరావు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, సత్యనారాయణ, గోసు ప్రసాద్, కె.రామకృష్ణ, దుర్గాప్రసాద్, రవిచంద్రశేఖర్, డి.సాయిబాబు, పి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

- సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- రెంటపాళ్లలో కొవ్వొత్తులతో ప్రదర్శన



రెంటపాళ్లలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: విజయవాడ నడిబొడ్డులో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ మూకల దాడి అమానుషమని సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం పై విగ్రహ శిలాఫలకాన్ని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తొలగించడంపై నల్లబ్యాడ్జిలు ధరించి మహిళలు పెద్దఎత్తున సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 430 కోట్లతో అతి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల ప్రోద్బలంతో పసుపు మూకలు విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారని విమర్శించారు. రాజ్యాంగ శిల్పిపై కూడా కక్ష సాధింపులు చేయడం సరైన విధానం కాదన్నారు. అధికారంలో ఉన్న వారి ప్రోద్బలంతోనే విగ్రహ ధ్వంసానికి పాల్పడ్డారన్నారు. సామాజిక అభ్యున్నతి కోసం దళిత వర్గాల తలరాతలు మార్చిన మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇంత దారుణానికి ఒడిగడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలంతా ముక్తకంఠంతో ఈ ఘటనను ఖండించాలని, ఘటన పై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా గ్రామంలో మహిళలు పెద్దఎత్తున ముందుకు వచ్చి కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఏకుల పెద్దమత్తయ్య, పల్లె. గాబ్రియల్, పైర్ల వెంకటేశ్వర్లు, తాటిమళ్ళ వెంకట్రావు, జెర్రిపోతు ఇస్మాయిల్, సాతులూరి లక్ష్మణరావు, వలపర్ల లక్ష్మణరావు, గుడిపూడి చంద్రయ్య, జంగిలి ఏసోబు, ఏకుల మరియదాసు, పైర్ల ఏసురత్నం, ఏకుల రాణి, కట్టా రమాదేవి, కట్టా శకుంతల రాజు,మహిళలు, తది తరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు



సత్తెనపల్లి: బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యతని, బాల్యవివాహాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యులు కావాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని న్యాయమూర్తులు సోమవారం సందర్శించారు. సరుకులు నిల్వ చేసే గదిని, వంటశాలను పరిశీలించారు. అక్కడ తయారైన పదార్థాలను పరిశీలించారు. ఆర్వో వాటర్ సిస్టం పనిచేయకపోవడాన్ని గమనించిన న్యాయమూర్తి వెంటనే దానికి మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అక్కడ ఉన్న విద్యార్థినులను న్యాయమూర్తులు వారికి అందుతున్న సదుపాయాలు, వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. పలు ముఖ్యమైన చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, సత్తెనపల్లి రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, విద్యార్థినులు ఉన్నారు.

బేబీ వార్మర్ కొనుగోలుకు ఆర్థికసాయం

రెంటచింతల: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బేబీ వార్మర్ కొనుగోలు నిమిత్తం టీడీపీ నేతలు రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు గోలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. రెంటచింతలకు చెందిన నాయకులు పీహెచ్‌సీని సందర్శించి వైద్యశాలకు వచ్చే రోగులకు అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా.. ఇంకా ఏమైనా అవసరమా అని వాకబు చేయగా.. ప్రస్తుతం ఆస్పత్రిలో బేబీ వార్మర్ అవసరం చాలా ఉందని, వివిధ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఒక మీటింగ్ హాలు కూడా నిర్మించేందుకు సహకరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వై.రమేష్, టీడీపీ నాయకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, ఆదూరి శివ, సైదులు బేబీ వార్మర్ కొనుగోలు నిమిత్తం రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందచేసి మీటింగ్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈఓ ఎ.ఆంజనేయులు తదితరులున్నారు.